## క్లుప్తంగా

### టికెట్ ఎవరికిచ్చినా గెలిపించుకుంటాం


సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు

**మణుగూరుటౌన్:** కాంగ్రెస్ అధిష్టానం పినపాక నియోజకవర్గం టికెట్ ఎవరికి ఇచ్చినా సమష్టి కృషితో గెలిపించుకుంటామని మణుగూరు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు శనివారం తెలిపారు. కిన్నెర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గం నుంచి ఆశావహులు 15 మందికి పైగా ఉన్నారని, ఎవరికి టికెట్ ఇచ్చినా మండల సీనియర్లమంతా పార్టీని గెలిపించి తీరుతామని స్పష్టం చేశారు. 200 మందికి పైగా హాజరైన ఈ సమావేశానికి పగిడేరు సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు తాటి సావిత్రి అధ్యక్షత వహించారు. సామా శ్రీనివాసరెడ్డి, పాలమూరు రాజు, నూరుద్దీన్, బానోత్ లక్ష్మణ్, కుర్రం రవి, ఓరుగంటి ప్రసాద్, బత్తుల వీరయ్య, ముక్కెర లక్ష్మణ్, పాల్వంచ రాములు, కంపా రవి, వరలక్ష్మి, రమణమ్మ, పెనుగొండ సాంబ శివరావు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### మణుగూరు ఏరియాలో డైరెక్టర్ పర్యటన

**మణుగూరుటౌన్:** సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణ శనివారం మణుగూరు ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం రాంచందర్‌తో కలిసి వర్క్ షాప్, ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అధికారులు ఫిట్జరాల్డ్, కేశవరావు, నర్సిరెడ్డి, రాంబాబు, రవీందర్‌రావు, శ్రీనివాసరావు, మధుసూదన్, డాక్టర్ శేషగిరి, సురేశ్, అనురాధ పాల్గొన్నారు.

### ‘మేరా మిట్టి- మేరా దేశ్’

**గుండాల:** ఖమ్మం తపాలాశాఖ ఎల్లందు సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సూర్యవశిష్ట ఆధ్వర్యంలో అజాద్ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో పోస్టల్ సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బంది సమక్షంలో మొక్కనాటి మట్టి సేకరించారు. అనంతరం లింగగూడెం, సాయనపల్లి, మూతాపురం గ్రామాల్లో గ్రామస్తుల సమక్షంలో మట్టి సేకరించారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సూర్య వశిష్ట మాట్లాడుతూ.. ఈ మట్టి ఢిల్లీలో ఏర్పాటు చేయనున్న అమృత వాటికకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది జి.రవీందర్, పి.సమ్మయ్య, వేముల అనిల్, కల్తి సుధాకర్, గొగ్గెల రాజేష్, శివ శంకర్, సత్యం, భవానీ, లావణ్య, లక్ష్మి, పోలీస్ సిబ్బంది, ప్రగతీ విద్యాలయం స్టూడెంట్స్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

### విద్యార్థుల శ్రమదానం

**దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ ప్రోగ్రాంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గంటపాటు శ్రమదానాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని కళాశాల ఆవరణలోని వివిధ మొక్కలను తొలగించారు. ప్లాస్టిక్ కవర్లు వంటి చెత్తాచెదారాలను తొలగించారు. కళాశాల ప్రిన్సిపల్ యల్.వెంకటేశ్వర్లు, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి మల్లెల శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

**ఐటీసీ ఆధ్వర్యంలో..**

**అశ్వాపురం:** మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఐటీసీ ఎంఎస్‌కే వాష్ సంస్థ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో పరిశుభ్రతపై నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాక అశోక్, ఉపసర్పంచ్ టేకుల సురేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తౌఫిక్, ఐటీసీ ఎంఎస్‌కే వాష్ సంస్థ పీఓ విజయ్, ఏపీఓ సునిల్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, వెంకట్, సుబ్బయ్య, సందీప్ పాల్గొన్నారు.

### క్రైస్తవుల వినతి

**భద్రాచలంటౌన్:** జిల్లాలోని క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎంపీ మాలోత్ కవితకు డివిజన్ క్రైస్తవ సంఘం సభ్యులు శనివారం వినతిపత్రాలు అందజేశారు. పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వారిని కలిసి తమ సమస్యను వివరించారు. యోహాన్, నిరీక్షణరావు, వెంకట్‌రెడ్డి, డానియల్, కామేశ్వరరావు, జాన్సన్, అంబోజి పాల్గొన్నారు.

### జయప్రదం చేయాలి

**దమ్మపేట:** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ తలపెట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కోలికపోగు కాంతారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ.. అక్టోబర్ 4న అలంపూర్‌లో మందకృష్ణ పాదయాత్ర ప్రారంభించనున్నారని తెలిపారు.

# సమస్యల వలయంలో పల్లె

- వెంటాడుతున్న బ్లాస్టింగ్ భయం
- పారిశుద్ధ్య లోపం.. తేళ్లు, పాముల స్వైర విహారం
- లారీల మితిమీరిన వేగంతో తరచూ ప్రమాదాలు
- రాజుపేట వాసుల దుస్థితి ఇదీ


రాజుపేట గ్రామం..

**మణుగూరురూరల్:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామం సమస్యలకు నిలయంగా ఉంది. సింగరేణిలో, సింగరేణి అనుబంధ ఓబీ సంస్థలు నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌ల వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కూతవేటు దూరంలో ఉన్న సింగరేణికి రాజుపేట గ్రామం ఉండడం వల్ల బ్లాస్టింగ్ చేసినప్పుడు ఇళ్లు కంపిస్తున్నాయి. ఇంట్లోని సామాన్లు కిందపడిపోతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు బ్లాస్టింగ్ సమయంలో ఉలిక్కిపడుతున్నారు. బ్లాస్టింగ్ ఎక్కువ మోతాదులో చేసిన సమయంలో పెద్దవారు సైతం గాబరాపడుతున్నారు. రాజుపేట గ్రామంలో నిత్యం బొగ్గు లారీల రాకపోకలు జరుగుతుంటాయి.

**మితిమీరిన వేగంతో లారీలు..**

గ్రామంలో నెమ్మదిగా వెళ్లాలనే సూచనలు ఉన్నా.. లారీ డ్రైవర్లు మాత్రం మితిమీరిన వేగంతో లారీలను నడుపుతున్నారు. వెరసి ప్రమాదాలకు కారణమవుతున్నారు. మనుషులు, జంతువులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా లారీ డ్రైవర్లు మాత్రం తమ తీరు మార్చుకోవడం లేదు. అధికారుల దృష్టికి రాజుపేట గ్రామస్తులు తమ సమస్యలను ఎన్నిసార్లు తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీల మితిమీరిన వేగాన్ని నియంత్రించడంలో సింగరేణి అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగి మనుషుల ప్రాణాలు కోల్పోతేనే తప్ప ముందస్తు చర్యలు తీసుకోరా..? అని ప్రశ్నిస్తున్నారు.

**తేళ్లు, పాముల బెడద..**

రాజుపేటలోని విఠల్‌రావునగర్, పీకె-1సెంటర్ చౌరస్తాలలో నివాసముంటున్న ప్రజలు తేళ్లు, పాములతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల పాములు, తేళ్లకు నివాస కేంద్రాలుగా మారాయి. ప్రతి రోజూ ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ఇళ్లల్లోకి పాములు, తేళ్లు చొరబడుతున్నాయి. పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి పాములు, తేళ్లను నివారించాలని రాజుపేట గ్రామస్తులు మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు తెలిపినా.. ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు రాజుపేట సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు.

### అతి వేగాన్ని నియంత్రించాలి



రాజుపేట, బాపనకుంట ప్రాంతాల్లో ప్రయాణిస్తున్న సింగరేణి బొగ్గు లారీల మితిమీరిన వేగాన్ని నియంత్రించాలి. ఈ లారీల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాలలో జంతువులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. బొగ్గు లారీలకు తోడు ఇసుక లారీలు కూడా మితిమీరిన వేగాన్ని పోలీస్ అధికారులు నియంత్రించాలి.

– కానూరి నాగేష్

### పాములు, తేళ్లతో ఇబ్బందిగా ఉంది



రాజుపేటలో పాములు, తేళ్లు ఎక్కువ సంఖ్యలో తిరగడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇంటి పన్నులు కట్టించుకున్నారు కానీ.. సమస్యలను పరిష్కరించాలి. పారిశుద్ధ్య పనులు నిర్వహించి పాములు, తేళ్లు నివారణకు చర్యలు చేపట్టాలి.

– కుంటా ప్రవీణ్

### సమస్యలు పరిష్కరించాలి



లారీ డ్రైవర్లు రోడ్డు సూచక బోర్డులను అనుసరించాలి. అప్పుడు మితిమీరిన వేగం ఉండదు. వీరు పట్టించుకోవడం లేదు కాబట్టి అధికారులే నియంత్రించాలి. పాములు, తేళ్ల బారి నుంచి ప్రజలను కాపాడాలి. ఆ మేరకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– తుంపిరి క్రాంతికుమార్

# ఏరియా ఆస్పత్రి సందర్శన


భద్రాచలంఅర్బన్: ఏరియా ఆస్పత్రిలో ఆరా తీస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శనివారం సందర్శించారు. వైద్యం అందుకుంటున్న రోగులను పరామర్శించి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు, గిరిజనుల పట్ల ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆయన సూచించారు. మరోవైపు, కేటీఆర్ పర్యటనలో బందోబస్తుకు వచ్చి ప్రమాదవశాత్తు మృతి చెందిన మహిళా హెడ్‌కానిస్టేబుల్ శ్రీదేవి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఆయన పరిశీలించారు. కాగా, మూడు రోజులుగా అస్వస్థతగా ఉన్న విప్ కాంతారావు.. ఏరియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దీంతో వైరల్ ఫీవర్‌గా తెలింది.

**పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల పరిశీలన..**

**మణుగూరురూరల్:** మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శనివారం స్థలాన్ని పరిశీలించారు. సుమారు కోటి 40లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఈ పీహెచ్‌సీ నిర్మించనున్నామన్నారు. అనంతరం సుందరయ్యనగర్‌లోని ముత్యాలమ్మతల్లి గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు అప్పారావు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, నర్సింహారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రచార రథం ప్రారంభం**

**మణుగూరురూరల్:** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల ప్రచార రథాన్ని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రచార రథం ద్వారా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు.

**పాటల సీడీ ఆవిష్కరణ**

రానున్న ఎన్నికల సందర్భంగా రూపొందించిన ‘వస్తున్నా మీ కోసం.. రేగన్న ప్రగతి’పాటల సీడీని శనివారం విప్ కాంతారావు ప్రారంభించారు. పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా ఈ పాటల సీడీ ద్వారా ముమ్మరంగా ప్రచారం చేయనున్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, నాయకులు వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, తాతా రమణ, ముద్దంగుల కృష్ణ, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

### గాయకురాలికి డాక్టరేట్

**అశ్వాపురం:** మండలంలోని మల్లెలమడుగుకు చెందిన గాయకురాలు తాళ్లూరి దేవమణికి ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ, ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యాన డాక్టరేట్ అందింది. తమిళనాడు రాష్ట్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు డాక్టరేట్ అందజేసి సన్మానించారు. గత పదిహేనేళ్లుగా గాయనిగా రాణిస్తున్న ఆమెకు సోషల్ సర్వీస్, కల్చరల్ విభాగంలో డాక్టరేట్ అందజేశారు.

### భద్రాద్రిలో భారీ వర్షం


రామాలయం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలో ఉరుములు మెరుపులతో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పిడుగుల పడుతుండడంతో భారీ శబ్దాలకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పట్టణంలోని లోతట్టు కాలనీల్లోని ఇళ్లలోని భారీగా వరద చేరింది. చర్ల, భద్రాచలం ప్రధాన రహదారి, రామాలయం పరిసర ప్రాంతాలతో పాటు పలు కాలనీలలో రోడ్లపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

### కళాశాలలో ఫ్రెషర్స్ డే

**అశ్వారావుపేటరూరల్:** స్థానిక వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ఆట, పాట, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ జి.వీరభద్రం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికీ కళాశాల విద్య ఉజ్వల భవిష్యత్‌కు పునాదిగా మారుతుందని అన్నారు. మానసిక ఆందోళనకు దూరంగా ఉండి, ప్రశాంతంగా ఉండేలా ప్రయత్నించాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వి.శేషుబాబు చేతుల మీదుగా ఆయనకు సన్మానం చేసి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే పథకాలు

**అశ్వారావుపేటరూరల్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని ములకలపల్లి జెడ్పీటీసీ, టీపీసీసీ సభ్యురాలు సున్నం నాగమణి అన్నారు. మండలంలోని ఖమ్మంపాడు, మేకలబండ, రమణక్కపేట, కోయ రంగాపురం, వడ్డెర రంగాపురం గ్రామాల్లో శనివారం ఆమె గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారెంటీ కార్డుల గురించి ప్రచారం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మా రాంబాబు, జుజ్జూరు దుర్గారావు, కొప్పుల శ్రీను, ఉప్పల రాజశేఖర్, ఎస్‌కె.బాబా, ముష్టిన శిరీష పాల్గొన్నారు.

# కార్మికుడికి సన్మానం


యాదగిరి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

**మణుగూరురూరల్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-2 గనిలో ఈపీ హెల్పర్‌గా పని చేసి పదవి విరమణ పొందిన అయితంరాజు యాదగిరి-లక్ష్మి దంపతులను సహోద్యోగులు, గని అధికారులు పూలమాలలు, శాలువాలతో శనివారం ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలతో సత్కరించారు.

అనంతరం యాదగిరి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యాదగిరి కుటుంబ సభ్యులు అయితంరాజు సతీష్‌చంద్ర, అయితంరాజు సాయిబాబు, గని అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో.. వానరాలు


కోతుల దాడిలో గాయపడ్డ వృద్ధుడు కృష్ణమూర్తి

**ములకలపల్లి:** వానరాల దాడితో ప్రజలు వణికిపోతున్నాయి. కోతిమూకలు మూకుమ్మడిగా దాడిచేసి గాయపరుస్తున్నాయి. దీంతో జనాలు భయభ్రాంతులకు గురౌతున్నారు. మహిళలు, పిల్లలపై దాడులకు పాల్పడడంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. మండలకేంద్రంలో కోతుల దాడిచేసిన ఘటనల్లో ఇప్పటికే పలువురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ములకలపల్లికి చెందిన వృద్ధుడు కుంచమఠం కృష్ణమూర్తిపై వానరమూక దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో అతని కుడిచేయి, వీపుభాగంలో రక్తస్రావమైంది. ఇటీవల ములకలపల్లికి చెందిన టైలర్ కాటే రామారావుపై కోతులు దాడి చేయడంతో గాయపడ్డారు. ఓ గిరిజన యువకుడిపైనా కోతులు మూకుమ్మడి దాడి చేయడంతో, తొడలు, వీపుపై గోర్ల గాట్లు పడ్డాయి. పాఠశాలకు వెళుతున్న విద్యార్థులపై కోతులు దాడి చేస్తున్నాయి. వారి వద్ద నుంచి క్యారేజీలను ఎత్తుకెళుతున్నాయి. మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోని ప్రవేశించి, సరుకులు ఎత్తుకెళుతున్నాయి. ఇలా ఒకటా రెండా.. కోతుల దాడిలో బాధితులు ఎందరో. ఘటనలు ఎన్నో. సర్పంచ్, జీపీ కార్యదర్శి, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# 111 శాతం బొగ్గు ఉత్పత్తి


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జీఎం దుర్గం రామచందర్

**మణుగూరుటౌన్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సెప్టెంబర్‌కు సంబంధించి 8.88 లక్షల టన్నులకు 9.89 లక్షల టన్నుల బొగ్గు వెలికితీసి 111 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. ఓబీ వెలికితీతలో వర్షం కారణంగా అనుకున్న లక్ష్యం చేరలేకపోయామని, 14లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి 8.98లక్షలు 64శాతం మాత్రమే వెలికితీశామని తెలిపారు. ఏరియాలో రోడ్డు, రైలు, రోప్‌వే ద్వారా బొగ్గును 9.60లక్షల టన్నులు సరఫరా చేశామన్నారు. అనంతరం ఏరియాలో కార్మికులకు అందిస్తున్న సదుపాయాలను, పదవీ విరమణ పొందిన కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అధికారులు వీసం కృష్ణయ్య, వెంకట్రావ్, సలగల రమేశ్, వీరభద్రం, రమేశ్, శ్రీనివాసరావు, షబ్బీరుద్దీన్ పాల్గొన్నారు.

# ముమ్మరంగా వైద్య శిబిరాలు

**అన్నపురెడ్డిపల్లి:** మండల పరిధిలోని రాజాపురం గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌ఎస్ నాగేశ్వరరావు, పుష్ప, జయలక్ష్మి, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

**ఆశ్రమ పాఠశాలల్లో..**

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని సున్నంబట్టి, పెదవాగు ప్రాజెక్టు ఆశ్రమ పాఠశాలల్లో శనివారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో 49 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయగా.. వీరిలో 9 మంది జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. అవన్నీ సాధారణ జ్వరాలేనని వైద్యాధికారి పరీక్షల ద్వారా తెలిపారు. వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాల్లో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్‌ఎస్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం భూలక్ష్మి పాల్గొన్నారు.

**సింగరేణి ఆధ్వర్యంలో..**

**మణుగూరుటౌన్:** సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని సింగరేణి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామం కొత్త కొండాపురంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు రవికుమార్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 73 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. స్టాఫ్ నర్స్ శారద, కృష్ణవేణి, శ్రీకాంత్, నవీన్ ఉన్నారు.

# జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

**మణుగూరుటౌన్:** హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన 21వ జాతీయ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో మణుగూరు ఎక్సలెంట్ స్టార్ హై స్కూల్ విద్యార్థులు స్వర్ణ పతకం సాధించారు. శనివారం జూనియర్ విభాగంలో జరిగిన కట్ట పోటీలో శ్రేయస్వి, సబ్ జూనియర్ విభాగంలో సాయి సిద్దార్థ్ స్వర్ణ పతకం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు.

**జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో..**

అశ్వాపురం మండలం గొందిగూడెంలో నిర్వహించిన జోనల్, జిల్లా స్థాయి ఆటల పోటీల్లోనూ ఎక్స్‌లెంట్ విద్యార్థులు ప్రతిభ చూపారు. రన్నింగ్ బాలుర విభాగంలో వెంకట్ మొదటి స్థానం, బాలికల విభాగంలో నందిని రెండో స్థానం, 400 మీటర్ల పరుగులో దివిజ మొదటి స్థానం, డిస్కస్ త్రోలో లిఖిత రెండో స్థానం, వాలీబాల్‌లో హర్షిణి రామ్, యామిని రెండో స్థానం సాధించారని, కబడ్డీ, వాలీబాల్, ఖోఖోల్లో సమీర్, రామ్‌చరణ్, ఆఫియా, ప్రీతి ఎంపికయ్యారని పాఠశాల చైర్ పర్సన్ యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్ యాకూబ్ షరీఫ్ తెలిపారు.

# కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

**మణుగూరురూరల్:** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మణుగూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శనివారం సమ్మె 20వ రోజుకు చేరింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయకుమారి, అరుణ, సుల్తానా, సుమలత, సంధ్య, లక్ష్మి పాల్గొన్నారు.

**ఆశావర్కర్ల సమ్మె..**

**చంద్రుగొండ:** మండలకేంద్రం చంద్రుగొండలోని జాతీయ రహదారిపై ఆశావర్కర్లు ఆరోరోజు శనివారం మానవహారం నిర్వహించారు. ఆందోళనలో సీపీఎం మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి, నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, పెద్దిని వేణు, ఆర్ వెంకటాచారి, ఆశవర్కర్లు జనగాం రుక్మిణి, రమాదేవి, కె.అరుణ, పుణ్యవతి, లక్ష్మి, శిరోమణి, జయమ్మ, పద్మ పాల్గొన్నారు.

**ములకలపల్లి:** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం మండలకేంద్రంలో మానవహారం నిర్మించారు. ప్రధానకూడలి వద్ద చేపట్టిన నిరసనచ కార్యక్రమాన్ని ఉద్దేశించి, ఆశా వర్కర్ల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బా ధనలక్ష్మి మాట్లాడారు. కీసరి జయ, నల్లి సుజాత, కొడిమె ఇందిర, శైలజ, రోశమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### రూ.కోటి ఇవ్వాలి

**భద్రాచలంటౌన్:** భద్రాచలంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బందోబస్తు నిర్వహించేందుకు వచ్చి డ్రెయినేజీలో పడి మృత్యువాత పడిన హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీపీఎం, బీజేపీ నాయకులు శనివారం వేర్వేరు ప్రకటనలలో పేర్కొన్నారు. ప్రకటన చేసిన వారిలో మచ్చ వెంకటేశ్వర్లు, నాగబాబు, రామ్మోహన్ రావు, వెంకన్న, చక్రవర్తి, కోటేశ్వర్లు ఉన్నారు.

### పోరాటాలతో కుల నిర్మూలన

**దుమ్ముగూడెం:** బలమైన వర్గ పోరాటంతోనే కుల నిర్మూలన సాధ్యమని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి సాయన్న అన్నారు. శనివారం మండలంలోని నారాయణరావుపేట గ్రామంలో ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో ‘కులాన్ని ఎలా నిర్మూలించాలి’అనే విషయంపై ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కులగజ్జి పోవాలంటే కులాంతర వివాహాలు కచ్చితంగా జరిగి తీరాలని అన్నారు. సున్నం వీరభద్రం, బాబు, వెంకటరాజు, సూరి, రాజులు, శ్రీను, రాజులు పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమంలో అన్నదానం

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డు సరోజిని వృద్ధాశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ములుగు జిల్లా, వాజేడు మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించిన ఎడవల్లి లక్ష్మీనరసింహారావు జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. రజిని, చిరు వెంకట సాయికృష్ణ, రమ్యశ్రీ, ఉమాదేవి, నరసింహారావు, లలిత, సరిత, నీలిమ పాల్గొన్నారు.

# అరెస్టులపై నిరసనల వెల్లువ

భద్రాచలంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో శనివారం పోలీసులు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, తెలుగుదేశం, ఇతర ఆదివాసీ, ప్రజాసంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆయా పార్టీల నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. అరెస్టులు అక్రమమని, నిర్బంధాలు, అణచివేతలతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. కాగా, ఈ నిరసనల్లో ఇప్పటికే సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన వర్కర్లు పాల్గొని మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: అరెస్ట్ అయిన నాయకులతో ఎమ్మెల్యే పొదెం వీరయ్య


చర్ల: మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు


అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు